క్లుప్తంగా

అన్నమయ్య స్వరార్చన



మాదాపూర్: మాదాపూర్ అన్నమయ్యపురంలో అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం నటరాజ నృత్య కళాకేంద్రం శిష్యులు ప్రదర్శన ఇచ్చారు. గురువు నాగమణి నేతృత్వంలో మూషిక వాహన, వినరో భాగ్యము, నగుమోము, రామాయణ శబ్దంలకు కళాకారులు వైష్ణవి, ఖ్యాతి, ప్రణతి, వందిత, సాయిరియన్నీ, హర్షిణి,, నిహారిక, వర్షితలు నృత్య ప్రదర్శనతో అలరించారు.

బూత్‌స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు ఎం.రవికుమార్ యాదవ్ తదితరులు

గచ్చిబౌలి: బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం గోపన్‌పల్లి తండాలో పార్టీ కార్యాలయాన్ని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, కలసికట్టుగా పోరాడితే వచ్చే ఎన్నికల్లో గెలుపు సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, హన్మంత్ నాయక్, రాధాకృష్ణ యాదవ్, కృష్ణ ముదిరాజ్, లక్ష్మీ, రంగస్వామి ,సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష

- 8 కేంద్రాలలో నిర్వహణ

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయలో 9వ తరగతిలో చేరడానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. శనివారం శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని 8 పరీక్షా కేంద్రాలలో రంగారెడ్డి జిల్లా, వికారాబాద్ జిల్లా, మేడ్చల్ జిల్లాలోని విద్యార్థులు పరీక్ష రాశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాదాపూర్, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, మియాపూర్, రాయదుర్గం, కొండాపూర్, మణికొండ, నార్సింగిలలోని జెడ్పీహెచ్‌ఎస్‌లను ప్రవేశ పరీక్ష కేంద్రాలను నిర్వహించారు. 1631 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 831 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మూడు ఖాళీలు ఉండగా ఒక్క సీటు కోసం 544 మంది దరఖాస్తు చేసుకున్నారు.

రూ.85 కోట్లతో గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధి

- నిత్యం ప్రజల్లో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి
- కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



గౌలిదొడ్డిలోని డివిజన్ కార్యాలయంలో మాట్లాడుతున్న గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

గచ్చిబౌలి: గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధే లక్ష్యమని, నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు. తన డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్పొరేటర్‌గా ఎన్నికై రెండేళ్లు పూర్తైన సందర్భంగా శనివారం గౌలిదొడ్డిలోని డివిజన్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.85 కోట్ల నిధులు మంజూరు చేసిందని, ఎమ్మెల్యే గాంధీ, ఎంపీ రంజిత్ రెడ్డి సహకారంతో పనులు పూర్తి చేస్తున్నామన్నారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ.35 కోట్ల నిధులతో 80 పనులు పూర్తి చేశామని, అలాగే కోటి రూపాయలతో రాయదుర్గంలో రెండు రోడ్లు, యూజీడీ పనులు.. గోపన్‌పల్లి తండా, ఎన్‌టీఆర్‌నగర్‌లో రెండున్నర కోట్లతో సీసీ రోడ్లు, యూజీడీ పనులు పూర్తి చేశామని వెల్లడించారు. రూ.80 లక్షలతో కేశవనగర్‌లో సీసీ రోడ్లు రూ.1.20 కోట్లతో నానక్‌రాంగూడ, రూ.91 లక్షలతో ప్రశాంత్‌హిల్స్‌లో రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. హుడా కాలనీ, నల్లగండ్లలో రూ.120 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు ఆయన వివరించారు. మంజీరా డైమండ్ హైట్స్, ఐసీఐసీఐ బ్యాంక్‌నుంచి గోపన్‌పల్లి తండా వరకు నాలుగు కోట్ల నిధులతో స్టామ్ వాటర్ డ్రెయిన్, హుడాకాలనీలో ఆరు కోట్లతో పార్క్‌ల సుందరీకరణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. టీఎన్‌జీఓస్, జర్నలిస్ట్ కాలనీ, గౌలిదొడ్డిలోని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రూ.50 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. చెరువులలో మురుగునీరు కలవ కుండా చర్యలు తీసుకుంటామన్నారు. రాయదుర్గంలో యూజీడీ పనులు చేపడతామని చెప్పారు. పార్టీలు వేరైనా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే, ఎంపీలను కలుస్తానని తెలిపారు. బసవతారక నగర్, జీపీఆర్‌ఏ రోడ్డులో కూల్చివేతలు చేశారని, బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'అంగడి'లో సందడి



సీసీటీలో ఆకట్టుకుంటున్న అంగడి ప్రదర్శన

- ఆకట్టుకుంటున్న హస్త కళాకృతులు
- గ్లాస్ గాజులు, బ్యాగులు, మధుబని ఆర్ట్



బంజారాహిల్స్: సంప్రదాయ హస్తకళలను నగరవాసులకు పరిచయం చేయడంతో పాటు దేశ వ్యాప్తంగా పేరొందిన ప్రఖ్యాత హస్త కళాకారులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో ఉన్న క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ (సీసీటీ)లో కొనసాగుతున్న అంగడి ది క్రాఫ్ట్ బజార్ నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

- దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 25 మంది హస్త కళాకారులు తమ చేతివృత్తులను ప్రదర్శించడమే కాకుండా విక్రయాలకు ఉంచారు.
- ముఖ్యంగా ఆక్సిడైజ్డ్ జ్యువెలరీ మహిళలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఆభరణాల కోసం నగర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు విచ్చేస్తుండటంతో అంగడిలో సందడి నెలకొంది.
- తమిళనాడుకు చెందిన తాడా ఎంబ్రాయిడరీ ఈ ప్రదర్శనలో మరో ప్రత్యేకతగా నిలుస్తున్నది.
- బిహార్‌కు చెందిన కళాకరులు మధుబని ఆర్ట్ తో కట్టి పడేస్తున్నారు.
- రాజస్థాన్ కళాకారులు టెర్రకోట వేర్‌ను ప్రదర్శనకు ఉంచారు.
- బ్యాంబూ క్రాఫ్ట్ కనువిందు చేస్తున్నది. ఇంట్లో ఇంటీరియర్ కోసం బ్యాంబూ క్రాఫ్ట్‌తో పాటు టెర్రకోట వేర్‌ను కొనుగోలు చేస్తున్నారు.
- గ్లాస్ బ్యాంగిల్స్‌ను మహిళలు ఎక్కువగా కొంటున్నారు. ఉడ్ కార్వింగ్ అద్భుతంగా ఉంది.
- మూంజ్ బాస్కెట్ కళాకృతుల విక్రయాలు బాగున్నాయి.
- ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రదర్శనను సీసీటీ కార్యవర్గం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నది.

ఉచిత వైద్యశిబిరం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పటేల్‌కుంట పార్కు వాకర్స్‌కు ఆర్‌కేవైటీం ఆధ్వర్యంలో ఉద్భవ చిల్డ్రన్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్‌ను అదుపులో పెట్టుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు వాకర్స్ ఇక్కడ సౌకర్యాలు సరిగా లేవని తెలిపారు. ఓపెన్ జిమ్ సామగ్రిని ఏర్పాటు చేయించాలని కోరారు. సమస్యలను జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఆయన ఇచ్చారు. కార్యక్రమంలో వాకర్స్ సత్యనారాయణ, నర్సింగ్ యాదవ్, చారి, నర్సింగ్‌రావు, భాస్కర్‌రెడ్డి, అంజయ్య,గోపాల్‌రావు, వెంకటస్వామి, ఎత్తరి రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



అనుముల జయశంకర్‌రెడ్డి (ఫైల్)

మియాపూర్: భార్యాభర్తల మధ్య గొడవలతో మనస్థాపం చెంది ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ యాదగిరిరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్‌కు చెందిన అనుముల జయశంకర్‌రెడ్డి(52) మియాపూర్‌లోని మాతృశ్రీనగర్ సాయి గణేష్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. భార్య అనుముల సునీతారెడ్డి మాతృశ్రీనగర్‌లోని అపర్ణ కౌంటీలో నివాసముంటుంది. వీరికి 20 సంవత్సరాల క్రితం వివాహం జరగగా 17 సంవత్సరాల కుమారుడు సాయి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నాడు. జయశంకర్‌రెడ్డి ఏపీ అమరావతి ఎండోమెంట్ అడ్వకేట్‌గా పనిచేస్తున్నాడు. అయితే 2019 నుండి జయశంకర్ రెడ్డి, సునీతారెడ్డిలు వేరువేరుగా ఉంటున్నారు. నాలుగు సంవత్సరాల నుంచి ఒక్కడే ఉంటూండడం ,ఆరోగ్యం సహకరించకపోవడంతో శుక్రవారం రాత్రి అపార్ట్‌మెంట్‌లో ఉరేసుకున్నాడు. శనివారం ఉదయం వాచ్‌మెన్ గదికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు సోదరుడు ప్రభాకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

మియాపూర్: యువకుడి హత్య కేసులో నిందితుడిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం మియాపూర్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను మియాపూర్ ఏసీపీ నర్సింహారావు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే... పటాన్‌చెరు లక్డారం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల ప్రవీణ్‌కుమార్(26) ,వికారాబాద్ జనగాం గ్రామానికి చెందిన లాలూ ప్రసాద్ యాదవ్(22) చెత్త ఏరుకుంటూ జీవనం కొనసాగిస్తుండేవారు. ఈ క్రమంలో ప్రవీణ్,లాలూ ప్రసాద్‌లు వారం రోజుల క్రిందట మియాపూర్‌లోని ఆల్విన్ ఎక్స్‌రోడ్డు వద్ద ఓ పాత ఇనుపసామానుల దుకాణంలో కలిశారు. అప్పటి నుండి నిత్యం కలిసి మద్యం సేవిస్తూ ఉండేవారు. ఐదురోజులకిందట విహార్ బార్ వద్ద ప్రవీణ్ అత్యవసరం అని లాలూ ప్రసాద్ వద్ద రెండు వేల రూపాయలు తీసుకున్నాడు. ఈ నెల 8వ తేదీన సాయంత్రం ప్రవీణ్‌ను డబ్బులు అడిగాడు. అనంతరం ఇద్దరు మియాపూర్ పాత బస్టాండ్ వెనుక ఉన్న మహారాజ వైన్‌షాపు దగ్గర మద్యం కొనుగోలు చేసి అక్కడే బస్టాండ్‌లో కూర్చొని మద్యం తాగారు. ఈ క్రమంలో మరలా లాలూ ప్రసాద్ ప్రవీణ్‌ను డబ్బులు అడగగా అతని కుటుంబాన్ని దూషించడంతో లాలూ ప్రసాద్ బీరు సీసాతో ప్రవీణ్ తలపై గట్టిగా కొట్టడంతో కిందపడిపోయాడు. వెంటనే బీరు సీసాతో చేతి మణికట్టు వద్ద, గొంతుపై పొడిచాడు. అనంతరం సమీపంలో ఉన్న బండరాయితో రెండుసార్లు తలపై మోదాడు. దీంతో అతను మృతిచెందాడు. స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించగా లలూ ప్రసాద్ హత్య చేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించాడు. ఈ మేరకు లాలూ ప్రసాద్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నేడు బాలబృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం బాలబృందావనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 'కీప్ స్మైలింగ్ టు షిన్నింగ్' పేరిట ఈ కార్యక్రమాన్ని సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో 9 నుంచి 14 ఏళ్లలోపు బాలబాలికలు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

జ్యోతిర్లింగ మహా పడిపూజ

రాయదుర్గం: 'ఓం నమశ్శివాయ' నామస్మరణతో గౌలిదొడ్డిలోని ఎల్లమ్మ, పోచమ్మ ఆలయ ఆవరణ మారుమోగుతోంది. గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డి పరిసర కాలనీలు, బస్తీవాసులు ఈ ఏడాది 70 మంది శివదీక్ష తీసుకున్నారు. 41రోజుల పాటు నిష్టతో రోజు ఉదయం, సాయంత్రం జ్యోతిర్లింగ పూజలు చేస్తారు. ఈసారి ప్రత్యేకంగా సోమవారం అయిదుగురు శివ భక్తులు అఘోరాల వేషధారణలో కనిపించారు.



సైన్స్ ఫెయిర్

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ప్రదర్శనలో ఉంచిన నమూనాల గురించి విద్యార్థులు వివరించిన తీరు ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిఖిలరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ విజయశ్రీ, మేనేజింగ్ డైరెక్టర్లు నర్సిరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



కుమ్మరిబస్తీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

మాదాపూర్: కొండాపూర్ డివిజన్ మాదాపూర్ విలేజ్ కుమ్మరిబస్తీలో రూ.25 లక్షలతో అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదాపూర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఏఈ జగదీశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, శ్రవణ్‌యాదవ్, రాజుయాదవ్, రవీందర్ ముదిరాజ్, నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. ట్రాన్స్‌ఫార్మర్లు





- కంచె లేక ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన
- అధిక వినియోగంతో విద్యుత్ హెచ్చుతగ్గులు
- ఇళ్లలో పాడవుతున్న ఎలక్ట్రానిక్ వస్తువులు

మాదాపూర్: మాదాపూర్ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. వీటి చుట్టూ కంచె ఏర్పాటు చేయలేదు. వీటి పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. మాదాపూర్‌లోని సాయినగర్, చందానాయక్ తండా, సర్వే ఆఫ్ ఇండియా, గుట్టల బేగంపేట్ తదితర ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్లకు తీగలు అల్లుకుపోయాయి. ఎండకు, వానకు అవి శిథిలావస్థకి చేరి వాటిపై కోడ్‌లు సైతం చెరిగిపోయాయి. ఇక ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజుబాక్సులు తెరిచే ఉన్నాయి. కాగా మాదాపూర్‌లో ఐటీ సముదాయాలు ఉండడంతో వినియోగం ఎక్కువగానే ఉంటుంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ కంటే అధికంగా వినియోగించడం వల్ల కరెంట్ హెచ్చుతగ్గులు వస్తుండడంతో ఇళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గాలులు వీచినప్పుడు, భారీ వర్షాలకు మంటలు వస్తున్నాయని స్థానికులు తెలిపారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.






ఆర్ట్‌గ్యాలరీలో వింటర్ బ్రీజ్, కన్వర్జేషన్స్



వింటర్ బ్రీజ్ చిత్రప్రదర్శనను ప్రారంభించిన ఎమ్మెల్సీ వాణీదేవి



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శనివారం వింటర్ బ్రీజ్ పేరిట కర్ణాటక కళాకారుల చిత్రప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఎమ్మెల్సీ వాణీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. ఈనెల 13వ తేదీ వరకు ఉదయం 11గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎం.వి రమణారెడ్డి, కళాకారులు బి.నాగేశ్‌గౌడ్, సంజయ్ అస్తపుత్ర, పి.జ్ఞానేశ్వర్‌రావు, నరేశ్‌బొల్లు పాల్గొన్నారు.

కన్వర్జేషన్స్ పేరిట..

అలాగే కన్వర్జేషన్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనలో కృష్ణ అశోక్ వేసిన చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు.45 చిత్రాలతో కూడిన ఈ ప్రదర్శన ఈనెల 18వ తేదీవరకు ఉంటుందన్నారు. ఏసీబీ చేతన, జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి పుల్లెల, హైకోర్టు అడ్వకేట్ దశరథ్, సినిమా డైరెక్టర్ ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కె ల్యాబ్స్ ఏర్పాటు

గచ్చిబౌలి: తెలంగాణలో కె ల్యాబ్స్ ఏర్పాటు చేయనున్నట్లు కైరోస్ టెక్నాలజీస్ ఫౌండర్ సీఈఓ సుధాకర్ పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలోని లీ మెరిడియన్ హోటల్‌లో కైరోస్ నూతన లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఐపీ ఆధారిత పరిష్కారాల కోసం కె ల్యాబ్(ఆర్అండ్‌డీ)ను ఏర్పాటు చేస్తున్నామన్నారు .కార్యక్రమంలో కైరోస్ టెక్నాలజీస్ సీఓఓ జగదీష్ మంకాల్, సీడీఓ రాధికారావు, స్ట్రాటజిక్ అడ్వైజర్ రాజ్ నెరావతి, బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆండ్రూ జాక్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా ఫుడ్, క్రాఫ్ట్ ఫెస్టివల్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్ శిల్పారామంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఒడిశా ఫుడ్, క్రాఫ్ట్ ఫెస్టివల్‌ను ఐఎస్ బీపీ ఆచార్య శనివారం ప్రారంభించారు. శిల్పారామం, కళింగ స్వరాజ్ విమెన్ వింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఒడిశా నుంచి వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పరుచుకున్న వారు కలిసి చేసుకుంటున్న పండగ ఇది. ఒడిశా బెల్ మెటల్, పటచిత్ర శారీస్, సంబల్పూరి, పట్టు, కాటన్ చీరలు, ఇక్కత్, కోటపాడు, పిపీలి, డ్రస్ మెటీరియల్స్, దుపట్టాలు అందుబాటులో ఉన్నాయి. బరంపురి పచ్చడి, కొరాపుట్ మిల్లెట్ టీ , సుజి కాకర, చెన్నపడో, ఆలూధాయ్, ధరి బరబరా తదితర ఒరియా ఫుడ్స్ అందుబాటులో ఉన్నాయి.



జగన్నాథ్ భజన, ఒడిస్సీ డ్యాన్స్, సంబల్పూర్ ఫోక్ డ్యాన్స్, ట్రైబల్ నృత్యాలు, పాటలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

